క్లుప్తంగా

పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుక అందజేస్తున్న వెంకటేష్

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన పాడిరైతు జాగిరి బాపురావు కూతురు వివాహానికి విజయ డైరీ సంస్థ తరఫున రూ.5వేల పెళ్లి కానుకను ఆదివారం జిల్లా బీఎంసీయూ ఇన్చార్జి ఎర్రవేణి వెంకటేష్, పాలమిత్ర సత్యనారాయణలు అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం మండలంలోని భక్తులతో పాటు, చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తమ పిల్లల తలనీలాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం చేశారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సీఐ

లింగాపూర్: మండలంలోని పవర్‌గూడ గ్రామానికి చెందిన భీము రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆదివారం పోలీసులు నిత్యావసర సరుకులు అందజేశారు. సీఐ అంజయ్య, ఎస్సై ప్రవీణ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి 60కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు.

గడ్డివాము దగ్ధం



దగ్ధమైన గడ్డివాము

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నందిగూడ గ్రామంలో రమేశ్ అనే రైతుకు చెందిన గడ్డివాము ఆదివారం దగ్ధమైంది. ఇంటి ఆవరణలో ఉన్న గడ్డివాము విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో దగ్ధమవగా వెంటనే స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం గ్రామస్తులు నీటితో మంటలను చల్లార్చారు. అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. అధికారులు నష్టపరిహారం అందించాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

క్రికెట్ విజేత జన్నారం జూనియర్ టీం

జన్నారం: సంత్ సేవలాల్ జయంతి పురస్కరించుకొని సేవలాల్ యువసేనా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో జన్నారం జూనియర్ టీం విజేతగా నిలిచింది. రెండో స్థానంలో ఓం సాయి టీం నిలిచినట్లు నిర్వాహకులు బాదవత్ సాయి కిరణ్ తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.25వేలను కెప్టెన్లకు నిర్వాహకులు సందేశ్, సాయికిరణ్ అందజేశారు. కార్యక్రమంలో సేవలాల్ మహారాజ్ భక్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌ను మందమర్రికి చెందిన ఆదిజాంబవ సంఘం నాయకులు ఆదివా రం పోలీస్‌స్టేషన్‌లో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాజనర్సు, అధ్యక్షుడు వాసాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీడునూరి శంకర్, నాయకులు ఆవునూరి పోషం, దాసరి రాజ నర్సు, రేగుంట రాజయ్య, కల్వల శ్రీనివాస్ ఉన్నారు.

ప్రవేశ పరీక్షకు స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆదివారం నిర్వహించిన ప్రవేశ అర్హత పరీక్షకు విద్యావంతులైన నిరుద్యోగుల నుంచి భారీ స్పందన ల భించింది. బెల్లంపల్లి అభివృద్ధి సంస్థ ఫా ండేషన్ ఆధ్వర్యంలో ప్రవేశపరీక్షను నిర్వహించారు. సదరు సాఫ్ట్‌వేర్ కంపెనీలో 75పోస్టులు ఉండగా ఏకంగా 546 మంది విద్యావంతులు పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్ కిరణ్ మృదుల, బీఏఎస్ సెక్రెటరీ ఆదర్శ్‌వర్ధన్ రాజు, జాయింట్ సెక్రెటరీ కోడూరి కృష్ణ, కోశాధికారి సుధాకర్, హెచ్‌ఆర్ రజని పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహం తీరేదెలా?

- కొప్పుగూడ క్వారీలో పుష్కలంగా నీరు
- జంతువులు దిగేందుకు అనువుగా లేని వైనం
- మెట్ల నిర్మాణం చేపట్టాలని గతంలో ప్రతిపాదనలు
- ఇప్పటికీ చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు



కొప్పుగూడ వద్ద ఉన్న క్వారీలో నీరు

కెరమెరి: రానున్నది వేసవికాలం.. వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడం కోసం అనేక ఇబ్బందులు పడుతుంటాయి. కొన్నిసార్లు నీటి కోసం గ్రామాల సమీపాల్లోకి, రోడ్లపైకి వస్తుంటాయి. ఈ సందర్భంలో ఒక్కోసారి కుక్కలు వెంబడించి వాటిని హతమారుస్తుంటాయి. కెరమెరి అటవీ ప్రాంతంలో పుష్కలంగా నీరు ఉన్నా ఆ నీటిని వన్యప్రాణులు వినియోగించుకునేలా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కొప్పుగూడ వద్ద ఉన్న క్వారీలో నీరు ఉన్నా వన్యప్రాణులు అందులోకి దిగి తాగేందుకు అనువుగా లేదు. మెట్లు నిర్మించి క్వారీలోని నీటిని వన్యప్రాణులు తాగేలా చూడాలని స్థానికులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్రతిపాదనలు పంపినా..

2017లో అప్పటి ఫారెస్టు డివిజనల్ అధికారి రవీందర్ గౌడ్ కెరమెరి అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. జంతువులకు నీటి లభ్యత గురించి కొప్పగూడ వద్ద ఉన్న క్వారీని పరిశీలించారు. క్వారీలో నీరు ఎల్లప్పుడు నిల్వ ఉంటుండడంతో పాటు జన సంచారం లేని ప్రాంతంగా గుర్తించారు. వన్యప్రాణులు నీరు తాగేందుకు వీలుగా, క్వారీలోకి దిగేందుకు మెట్ల నిర్మాణం చేపట్టడంతోపాటు క్వారీ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వెంటనే ప్రతిపాదనలను సైతం ఉన్నతాధికారులకు పంపించారు. కానీ నేటి వరకు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ క్వారీలో పుష్కలంగా నీరున్నా నిరుపయోగంగానే ఉంది. కాగా సిమెంట్ స్తంభాలతో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్లు తెగిపోగా, స్తంభాలు నేలకొరిగాయి.

32 రకాల జీవరాశులు..

మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 21 బీట్లు, 8 సెక్షన్లు ఉన్నాయి. 21 మంది బీట్ అధికారులకు ఏడుగురు, 8 మంది సెక్షన్ అధికారులకు ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇక్కడ అడవుల విస్తీర్ణం 50వేల ఎకరాల్లో ఉంది. ఈ అటవీ ప్రాంతంలో సుమారు 32 రకాల వన్యప్రాణులు, పక్షులు, జీవరాశులు ఉన్నాయి. వీటిలో చిరుత, నీలుగాయి, కొండ చిలువ, పందులు, గొర్రెలు, అంబోతు, ఎలుగుబంట్లు, జింకలు, నక్కలు, తోడేళ్లు, కొండగొర్రెలు, బల్లులు, వివిధ రకాల పాములు, కోళ్లు, నెమళ్లు తదితర ప్రాణులు ఉన్నాయి. కానీ వన్యప్రాణులకు నీటి సౌకర్యం లేకపోవడంతో అవి తీవ్ర అవస్థలు పడుతున్నాయి. వేసవి కాలం రాకముందే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో వేసవి తాపానికి వన్యప్రాణుల దాహార్తి తీరడం కష్టంగా మారే అవకాశం ఉంది.

నీరు పుష్కలంగా ఉంది



కొప్పుగూడ క్వారీ వద్ద నీరు పుష్కలంగా ఉంది. వన్యప్రాణులు, ఇతర జీవరాశులకు దాహం తీర్చవచ్చు. కానీ నీరు తాగేందుకు జంతువులు లోనికి వెళ్లాలంటే మెట్లు నిర్మించాలి. గతంలో ఉన్న ఎఫ్‌డీవో ప్రతిపాదనలు పంపించినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు. ఉన్నతాధికారులు స్పందిస్తే వన్యప్రాణుల దాహం తీర్చవచ్చు.

– సయ్యద్ మజారోద్దిన్, ఎఫ్‌ఆర్‌వో

గ్రూప్ -4 టాపర్‌కు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: గ్రూప్ 4లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన శివకృష్ణను ఆదివారం విశ్వబ్రాహ్మణ కుల సంఘం సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ యువత శివకృష్ణను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. నాయకులు సురేష్, భాస్కర్ చారి, వెంకటయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దరిగాం, కొలాంగూడ గ్రామాల గిరిజన కుటుంబాలకు ఆదివారం శ్రీమిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి తిరుపతి మాట్లాడుతూ గిరిజన నిరుపేదలను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సభ్యులు ప్రభాకర్, వినోద్, బాలకృష్ణ, శ్యాంరావు, లక్ష్మీనారాయణ, అశోక్, అఖిల్‌తేజ్, శేఖర్, మంజుల, స్రవంతి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత శివాజీ

- జిల్లాపై మహారాష్ట్ర సరిహద్దు ప్రభావం
- జిల్లాలో వందల సంఖ్యలో శివాజీ విగ్రహాలు
- ఆరె కులస్తుల ఆరాధ్య యోధుడు
- నేడు శివాజీ మహరాజ్ 394వ జయంతి



చింతలమానెపల్లిలోని శివాజీ విగ్రహం

కౌటాల: మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు జిల్లాలో అభిమానులు, ఆరాధికులు రోజురోజుకు పెరుగుతున్నారు. పల్లెల నుంచి పట్టణాల దాకా ఏటా ఆయన జయంతి ఘనంగా జరుపుకుంటున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలోని గ్రామాల్లో శివాజీ మహరాజ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం శివాజీ మహరాజ్ జయంతి పురస్కరించుకొని గ్రామాల్లో వేడుకలు నిర్వహించేందుకు ఆరె కులస్తులు సిద్ధమవుతున్నారు.

పల్లెల్లో శివాజీ సైన్యం

శివాజీ మహరాజ్ అణగారిన, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటు పడడంతో పాటు తల్లిని ఏవిధంగా గౌరవించాలో ఆచరించి చూపారని శివాజీని ఆరాధించేవారు చెబుతున్నారు. శివాజీకి మహిళలపై అపారమైన గౌరవమని, ఇతర రాజ్యాలపై దండెత్తినప్పుడు స్త్రీలపై ఎలాంటి దాడులకు అనుమతించే వారు కాదని ఇలాంటి స్ఫూర్తి కోసమే గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరె కులస్తులు పేర్కొంటున్నారు. ఆరె కులస్తులు శివాజీ విగ్రహాల ఏర్పాటు కార్యక్రమాన్ని పండుగలా జరుపుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో యువత శివాజీ సైన్యం పేరిట కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. స్వచ్ఛందంగా చందాలు వేసుకొని గ్రామాల్లో భారీ విగ్రహాలను, కమిటీ హాల్‌లను నిర్మిస్తున్నారు.

నేడే వేడుకలు

నేడు ఛత్రపతి శివాజీ మహరాజ్ 394వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు గ్రామాల్లో యువత సిద్ధమవుతున్నారు. ఏటా శివాజీ జయంతిని ఆరె కులస్తులు, అభిమానులు ఒక పండుగలా జరుపుకుంటున్నారు. జయంతి సందర్భంగా గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించి శివాజీ విగ్రహాల వద్ద మహిళలు, అభిమానులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి జెండా ఎగురవేసి వేడుకలు నిర్వహించనున్నారు. జయంతి సందర్భంగా మండలంలోని గుండాయిపేట గ్రామంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు శివాజీ మహరాజ్ జీవిత చరిత్రపై మహారాష్ట్ర కళాకారుల ఆధ్వర్యంలో ప్రత్యేక నాటిక ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివాజీ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 19న ప్రభుత్వం సెలవు దినం ప్రకటించాలని ఆరె కులస్తులు కోరుతున్నారు.

జయంతి ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఛత్రపతి శివాజీ 394వ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్టుపల్లి జయరాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఛత్రపతి ఆరె సంక్షేమ సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు జిల్లా వ్యాప్తంగా శివాజీ జయంతి నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆరె కులస్తులు ప్రతీ గ్రామంలో జయంతి నిర్వహించి జిల్లా కేంద్రంలో నిర్వహించే జయంతి, ర్యాలీలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దాదారాం, బీక్కాజీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం



మరాఠా సామ్రాజ్యాధినేత శివాజీ మహరాజ్ జీవిత చరిత్ర యువతకు ఎంతో స్ఫూర్తి దాయకం. ఏటా పండుగ వాతావరణంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నాం. ఆరె కులస్తులు, అభిమానులు జయంతిని నేడు అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలి.

– ఎల్ముల్లే దత్తు, జిల్లా గౌరవ అధ్యక్షుడు, మరాఠా సంఘం

సెలవు దినంగా ప్రకటించాలి



శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 19న సెలవు దినంగా ప్రకటించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరాను. సేవాలాల్ జయంతికి ప్రత్యేక సెలవు ప్రకటించినట్లే శివాజీ జయంతి రోజు కూడా సెలవుదినంగా ప్రకటించాలి.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే

పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు జాఫర్ భీమేశ్ అన్నారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2100 మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్ పరీక్ష రాశారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాలశ్రీ, టీకానంద్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు టాలెంట్ టెస్ట్ ఎంతగానో దోహద పడుతుందని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కల్యాణ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎస్సెస్సీ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మొత్తం 150 మంది విద్యార్థులు పాల్గొని పరీక్ష రాశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు అర్జున్, జిల్లా నాయకులు ప్రశాంత్, మండల నాయకులు జావిద్, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థుల్లో ఉన్న టాలెంట్‌ను వెలికితీయడం కోసమే టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమిడే భీమేశ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం పట్టణంలోని వసుందర డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్, చేడ్వాయి ఉన్నత పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయం, ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి టాలెంట్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు కార్తీక్, నరసింహ, సాయి, వెంకటేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌపన్‌గూడలో రోడ్డుభద్రతా వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం, శ్రీ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్ర ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మజీద్ మాట్లాడారు. వాహనం నడిపే ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదన్నారు. వాహనం నడిపేటప్పుడు వాహనాల మధ్య 10 ఫీట్ల దూరం పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో వివిధ విషయాలపై అవగాహన కల్పించిన రాము, కుసుంబ్‌రావులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వసంత్‌రావు, బొజ్జిరావు, రాము, కుసుంబ్‌రావు, జంగు, తుకారాం తదితరులు ఉన్నారు.

వాహనాలు ప్రారంభించరా..!



పార్కింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన వాహనాలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ నుంచి గతంలో హిందువుల కోసం వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేయగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముస్లింలకు ఆఖరి సఫర్, క్రైస్తవులకు అంతిమయాత్ర పేరిట రూ.44లక్షల పట్టణ ప్రగతి నిధులతో రెండు వాహనాలను కొనుగోలు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చిందని నాడు ప్రారంభించక పోగా, ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలవుతోంది. గత పాలకవర్గంపై అవిశ్వాసంతో చైర్మన్, వైస్ చైర్మన్లు రాజీనామాతో ఈ వాహనాల ప్రారంభోత్సవం జరగలేదు. ఈ నెల 9వ తేదీన నూతనంగా చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరిగింది. కొత్తగా వచ్చిన చైర్మన్, వైస్‌చైర్మన్లు గాని, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే చేత గాని ఆయా వాహనాలను ప్రారంభించకపోవడంతో, ముస్లింలు, క్రైస్తవులు ఎవరైనా మృతి చెందితే వాహనాలు ఉన్నా, ప్రారంభోత్సవం కాలేదనే సాకుతో వాటిని మున్సిపల్ అధికారులు ఇవ్వడం లేదు. కనీసం ఆయా వాహనాలను ప్రారంభించి, వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం. దీంతో గత నాలుగు నెలల నుంచి ఆ వాహనాలు మున్సిపల్ పార్కింగ్‌లోనే దుమ్ము పట్టి పోతున్నాయి. రోజుల తరబడి ఆయా వాహనాలను నడపకపోయినా, అవి పాడయ్యే అవకాశాలున్నాయని, త్వరగా వాటిని ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బీరప్పకు లగ్గం పట్నాలు



ఆలయం వద్ద బోనాలతో మహిళలు

కౌటాల: మండలంలోని శీర్షా గ్రామంలో గల బీరప్ప స్వామి ఆలయం వద్ద గ్రామంలోని కుర్మ కులస్తులు ఆదివారం బీరప్ప దేవునికి ప్రత్యేక పూజలు చేశారు. బీరప్ప పండుగ పురస్కరించుకొని గ్రామంలో బీరప్ప స్వామికి లగ్గం పట్నాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. బీరప్ప పండగ సందర్భంగా ఆలయం వద్ద మంగళవారం నాగవెల్లి బోనాలు, గురువారం ఎట్టి ముల్లెలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకర్, పోశమల్లు, భీరయ్య, అల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై చంద్రశేఖర్ కోరారు. మెగా జాబ్‌మేళాకు 50కి పైగా కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా ద్వారా సుమారు 1000కి పైగా ఉద్యోగాలు కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీఫార్మా, ఎంఫార్మా, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంసీఎస్ చదివిన యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మందమర్రిరూరల్: ఈ నెల 11న రంగారెడ్డి జిల్లా జన్వాడ గ్రామంలోని మెథడిస్ట్ చర్చిపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్కేపీ ప్రేయర్ ఫెలోషిప్ యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరువతీసుకుని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు ప్రవీణ్, సామ్యేల్‌రాజ్, జాషువ తదితరులు ఉన్నారు.

నెన్నెలలో బస్‌షెల్టర్ కరువు

నెన్నెల: మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. కళాశాలకు వెళ్లే విద్యార్థులు బస్సు షెల్టర్ లేకపోవడంతో దుకాణాల షెడ్‌ల వద్ద ఎండలో బస్సుల కోసం ఎదురు చూస్తున్నా రు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు రో డ్ల పైనే పడిగాపులు కాస్తున్నారు. నిలువ నీడ లేక, తాగేందుకు నీరు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జాతర ప్రారంభం



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పెద్దవాగు సమీపంలో గల గద్దెల వద్ద సమ్మక్క సారలమ్మలకు భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ, మైసమ్మ దేవాలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ మాట్లాడుతూ ఈనెల 21న జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, మంద రాజయ్య, కోట శంకర్, శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, తిరుపతి భక్తులు పాల్గొన్నారు.